కథ

# మనస్సింహాసనం

— ఎమ్. వెంకటేశ్వరరావు



"...."

మీరు నా భర్తే. అయినా ఈ ఉత్తరం రాస్తున్నప్పుడు మిమ్మల్ని ఏమని సంభోదిస్తూ రాయాలో బోధపడటం లేదు. "ప్రియమైన", "గౌరవనీయులైన", "ప్రియాతి ప్రియమైన", "మై స్వీట్ హార్ట్" అని రాయాలనుంది. కానీ మిమ్మల్ని అలా పిలవటం నాకు ఇసుమంత కూడా ఇష్టంలేదు. ఎందుకంటే మిమ్మల్ని అలా పిలుస్తూ రాస్తే ఆ మాటల అర్థం అంతర్థానమవుతుంది. అందుకే ఈ ఉత్తరం సంబోధనారహితంగా రాస్తున్నాను.

"ఒకే ఇంట్లో కల్సి జీవిస్తున్నాం, నాకు ఎవరో దూరం నుండి రాస్తున్నట్టు ఈ ఉత్తరం ఏమిటి? అని మీ భృకుటి ముడుచుకుంటుందని నాకు తెలుసు. ముఖాముఖి చెప్పొచ్చు. కానీ మీరు ఎదురుగా కన్పిస్తుంటే నాలో మాటలు మౌనం వహిస్తున్నాయి. మీలో ఆరేళ్లుగా కలిసి జీవిస్తున్న నేను మీకు లెటరు రాయటం ఇదే మొదటిసారి, చివరిసారి కూడా. అసలు ఈ ఉత్తరం ఎందుకు రాస్తున్నానో చివరలో చెబుతాను. ముందు మన ఆరేళ్ల దాంపత్య జీవన పయనంలో అనేక సందర్భాల్లో, నాలో లోతుగా దిగబడ్డ ఆరని గాయాల్ని మీ ముందుంచితేనే నా మనసుకు కొంత ఊరట కలుగుతుంది.

మీకు గుర్తుందో, లేదో మన పెళ్లి రోజు. ఉదయం మా ఇంటి దగ్గర పెళ్లి, అదే రోజు సాయంత్రం మీ ఇంటిదగ్గర రిసెప్షన్. వేదిక మీది కుర్చీల్లో పక్కపక్కనే మన ఇద్దరం. మనల్ని అభినందించడానికి వచ్చిన వాళ్లు మీవైపు రాగానే మొహమంతా నవ్వు పులుముకుని, షేక్‌హాండిస్తూ, "భోంచేసి వెళ్లండి'అని, 'థాంక్స్ ఫర్ యువర్ కమింగ్' అనివాళ్లను పరామర్శించారే తప్ప, వాళ్లకు నన్ను పరిచయం చెయ్యటం గానీ, వాళ్ల ముందు సభ్యత కోసమైనా నావైపు తల తిప్పటం గానీ చెయ్యలేదు. నేను మీ పక్కన ఉన్న సంగతే గుర్తులేనట్టు ప్రవర్తించారు.

ఇది గమనించిన మీ ఫ్రెండ్ శేఖర్, మీ దగ్గరకు వచ్చి, "రేయ్! రాజా! ఏమిట్రా ఇది. ఇందాకట్నుంచి చూస్తున్నాను. వచ్చిన వాళ్లకి నీ భార్యని పరిచయం చెయ్యనక్కర్లేదా? అందరితో నువ్వే మాట్లాడటం సభ్యతగా లేదు. నీ ఫ్రెండ్సందరికీ ఆమెను పరిచయం చెయ్యటం మినిమమ్ మానర్స్ రా" అనంటే మీరేం బదులిచ్చారో గుర్తుందా!

"అవున్రా! అదొహటే తక్కువ. మా అమ్మానాన్నల మాట కాదనలేక కళ్లు మూసుకుని తాళికట్టాను. నువ్వు కూడా నీ అభిప్రాయాన్ని నామీద రుద్దాలనుకోకు. ఏది ఎప్పుడు చెయ్యాలో నాకు తెలుసు. వెళ్లి మన ఫ్రెండ్సందరినీ భోజనాలకి తీసుకెళ్లు" అని శేఖర్‌తో మెల్లగానే అయినా కోపంగా చెప్పిన ఆ మాటలు తూటాల్లా వచ్చి నా హృదయంలో 'కసక్'మని దిగబడ్డాయి.

వెంటనే నన్ను నేను చూసుకున్నాను. మీ పక్కన నుంచోడానికి పనికిరాని అవలక్షణాలు నాలో ఏమున్నాయో అంతుబట్టక నన్ను నేను పరిశీలించుకుంటూ నుంచున్నాను. మీ శరీరచ్ఛాయ పక్కన కొట్టొచ్చినట్టు కనిపించే నేను పౌర్ణమి పక్కన అమావాస్యనే మరి కాదనను. అంతమాత్రాన.... ఆపై మనసు తీవ్రంగా నెప్పి పెట్టటం మొదలెట్టింది.

మన పాప ధరణి. అది నా గర్భంలో రూపుదాల్చిన ఆ తరుణం కూడా మీ దృష్టిలో ఓ యాక్సిడెంట్ లాంటిదే. సహజసిద్ధమైన ఆకలి, మీలో రగులుతున్నప్పుడల్లా, మీరు

అసహ్యించికునే నాదేహానికి మిమ్మల్ని దూరంగా ఉండనివ్వలేదది. అది 'యాంత్రికతే' అని నా మనసుకు తెల్సినా, నా తనువు మీరు చూపే ఆ తాంత్రికతకు అలవాటు పడ్డది. ఎందుకంటే ఉప్పూ, కారం తగిలే నా దేహానికి అదే ఆకలి మరి.

నిద్రబోతున్నప్పుడు చిన్న శబ్దాన్ని కూడా భరించలేరు మీరు. ఆరోజు అర్ధరాత్రి ఒకటేపనిగా ఏడుస్తోంది ధరణి. కడుపు నొప్పి ఏమో! ఎంతకా ఆపకపోగా, రానురానూ పెద్దగా ఏడ్వటం మొదలెట్టింది. గదిలో నిద్రబోతున్న మీరు లేచి, వేగంగా తలుపులు తెరిచి, ఆవేశంగా "శని, ఎందుకిలా అర్ధరాత్రి దెయ్యంలా ఏడుస్తున్నావు" అంటూ పసిపిల్ల అని కూడా చూడకుండా దాని వంటిమీద పడబోతున్న మీ చేతిని అడ్డుకున్న నాపై మీరు ప్రదర్శించిన పురుషప్రతాపం ఇప్పుడు తల్చుకున్నా ఒళ్లు గగుర్పొడుస్తోంది.

అపుడు కూడా మీపై నాలో రగులుతున్న కోపాన్ని వ్యక్తపరచలేదు. కారణం, 'కోపంలో విచక్షణ కోల్పోయానన్న పశ్చాత్తాపం మీలో కల్గుతుందన్న భ్రమ నాలో, ఊఁ...హూ...

నేను మీకు నచ్చకపోవచ్చు. అయినా నేనూ ఒక మనిషినేగదా! నాకూ ఓ మనసూ, దానికంటూ కొన్ని ఆశలుంటాయని అవి తెల్సుకుని వాటిని తీర్చాలన్న బాధ్యత మీకుందని ఎప్పుడైనా ఆలోచించారా!... ఆలోచించరు. ఎన్నో చిన్న చిన్న ఆశలు తీర్చుకోగలవే. ఎందుకో మరి, నన్ను చూడగానే మీ మొహం ముకుళించుకుపోవటం చూడగానే నాలోని ఆశలు మనసు మూలలకు పారిపోయి, దాక్కోవటం నేర్చుకున్నాయి. అవి తీరని అడియాశలుగానే పోయాయి. పోతున్నాయి.

నాకు సంబంధించినంత నేనూ చదువుకుని, ఉద్యోగం చేస్తున్నదానినే. మీకులా నేనూ మిమ్మల్ని అసహ్యించుకుంటే నా బ్రతుకు నేను బ్రతకటం చేతకాక కాదు. ఎన్నో అవమానాలు, ఏమార్పుల మధ్య కూడా మీతో సహజీవనం సాగించడానికి కారణం నేను మనస్పూర్తిగా మిమ్మల్ని ప్రేమించడమే.

నా ప్రేమకు కారణమేమిటి?

మీ నిజాయితీ. న్యాయవిరుద్ధమైన పనులు ప్రోత్సహించని కరాఖండితనం. అందువలన ఏర్పడే కష్టనష్టాల్ని భరించగలిగే మనోధైర్యం.

మీ ఆఫీసులో మీ నిజాయితీకి బాధితులైన కొందరు ఏకమై, మిమ్మల్ని ట్రాప్ చేసి, విజిలెన్స్ అధికారులచే మిమ్మల్ని అరెస్ట్ చేయించారు. ఆ సమయంలో మీరు అవమానంతో ఎంత క్రుంగిపోయారో, తల్చుకుని విలవిల్లాడిపోయాను. అందుకే నేను ప్రేమించే మీ నిజాయితీకి ఎన్నటికీ మచ్చ రాక రాడదని నిరూపించడానికి పూనుకున్నాను. ఆ సంఘటన పిదప మీరు ఇల్లు దాటి బయటికెళ్లడం మానేశారు. అది భరించలేని నేను ఆఫీసుకు లీవుపెట్టి లాయర్ శంకర్ కోసం ఆయన ఇంటికీ, కోర్టుకీ కాలుకి బలపం కట్టుకుతిరిగాను. ఎంతో బిజీగా ఉండే లాయర్ శంకర్‌కి వళ్లంతా మెదడుందని అంటుంటారు. అనటం కాదు. వాస్తవం. చిన్న వయసులోనే అంతటి పేరుప్రఖ్యాతులు మరి. నా తిరుగుడు చూసి, మీ కేసు టేకప్ చేశాడాయన. మీ నిజాయితీ నిరూపించడానికి నేను సేకరించి ఇచ్చిన ఆధారాలు చూసి ఆశ్చర్యపోయాడతను. నేను మీ కేసు గురించి చెప్పే వివరాలు వింటూ, ఉత్సాహంగా నాతో కేసు డిస్కస్ చేసేవాడు.

మీరు అసహ్యించుకునే నారూపం లాయర్ శంకర్ కళ్లకి అసహ్యంగా కన్పించడం లేదు కాబోలు అనుకునేదాన్ని. ఆయన నాతో మాట్లాడుతున్నప్పుడు.'

"మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలియటంలేదు. కేసుకు సంబంధించిన వివరాలన్నీ మీరు అందించబట్టి నా పని సులభమయింది. నూరు శాతం కేసు గెలుస్తాం. థ్యాంక్యూ ఫర్ యువర్ కోఆపరేషన్" అంటూ లాయర్ శంకర్ ఆరోజు నన్ను అభినందిస్తుంటే, నా పక్కనున్న మీరు చూశారు.

మరుసటిరోజు నేను ఆఫీసుకెళుతూ లంచ్‌బాక్స్ హాండ్‌బాగ్‌లో పెడుతుంటే, మీ లెటర్ కన్పించింది. నాకోసం మీరు రాసిన మొదటి ఉత్తరం అదే కాబట్టి ఆత్రంగా చదవటం మొదలెట్టాను.

"రాధికా! నన్ను వదిలి వెళ్లిపోతావేమోనని భయంగా ఉంది. నువ్వు లేకుండా ఒక్కక్షణం కూడా జీవించలేను. నన్ను నమ్ము.

...నీ రాజా (రాజశేఖర్)"

మీ ఉత్తరం చదివాక నా అంతరంగం నుంచి ఏదో ధడేల్న కిందపడి పగిలిపోయినట్టనిపించింది. ఆరేళ్ల మన దాంపత్య జీవితమంతా నామీద అయిష్టతనే వెళ్లగక్కారు. దానికి కారణాలు కూడా నాముందే ఎన్నోసార్లు బహిర్గతంగా చెప్పారు. మరిచిపోలేదు. అప్పుడు మీరు నా ముందు నటించలేదు. మీరు మీలాగానే ఉన్నారు. ఆ గాంభీర్యతే ఇన్నేళ్లూ నన్ను మీతో కట్టిపడేసింది. కానీ ఈ మూడు ముక్కల ఉత్తరం నా నమ్మకాన్ని నీరుగార్చింది. మిమ్మల్ని ఇలా రాయించగలిగిన దేమిటో అర్థం చేసుకోలేనంత అవివేకురాల్ని కాదు.

లాయర్ శంకర్ నన్ను అభినందిస్తూ... "నేను గుర్తున్నానా మీకు. మీతో పెళ్లిచూపుల కోసం మీ ఇంటికి వచ్చాను. మీ చదువు, సంస్కారం, ఉద్యోగం అన్నీ మనస్పూర్తిగా నాకు నచ్చాయి. కానీ మీరు నాకంటే మూడేళ్లు పెద్దవారయుండి నన్ను మీ చెయ్యందుకోనియ్యకుండా చేశారు" అనటం విన్న మీరు... తట్టుకోలేక మీ దృష్టితో ఆలోచించారు.

ఒకవేళ నేను లాయర్ శంకర్ అభిమానానికి లొంగిపోయి, అతనితో నేను... వెళ్లిపోతే... 'నా గతి యేమిటి?' అనే భయం మీకు, ప్రస్తుతం ఉద్యోగం లేదు గనుక, మిమ్మల్ని మీరు కాపాడుకోవడానికి ఎంతకైనా దిగజారతారు" అనడానికి సాక్ష్యమే ఈ మీ ఉత్తరం.

ఇన్నాళ్లూ నేను అనుభవించిన అవమానాలికి మీలోని పురుషాహంకారం కారణమైతే,

ఇప్పుడు మీలో తలెత్తిన అనుమానానికి కారణం మీలోని పిరికితనం.

ఈ లెటర్ చదివాక మీ పిరికితనం పశ్చాత్తాపం వైపు పరుగెత్తినా అందుకోలేనంత దూరంలో ఉంది నా మనసు.

ఇంతకాలం మీరు నాతో ఎలా ప్రవర్తించినా నా మనస్సింహాసనంలో రాజాలాగా తిష్ట వేసుక్కూర్చున్నారు. ఇహ మీదట ఆ సింహాసనం అలాగే ఉంటుంది. కానీ అందులో మీరు మాత్రం ఉండరు. ఎందుకంటే ప్రస్తుతం నా మనసంతా మీరు సృష్టించిన శూన్యం ఆక్రమించుకుంది కాబట్టి.

■

